


# హాఫ్ టికెట్

## కురుమద్ది శరత్‌కుమార్

**పరబ్రహ్మాం పరమ పిసినారి. మంచి ప్రభుత్వ ఉద్యోగం ఉన్నప్పటికీ ఎందుకో విపరీతంగా పిసినారితనం అలవాటైపోయింది.** ప్రతి పనిలో, ప్రతి చేష్టలో పిసినారితనం చూపకుంటే పరబ్రహ్మాంకు నిద్ర పట్టేది కాదు. బస్సులో వెళితే రోజుకు పది రూపాయలు ఖర్చు అయిపోతాయన్న బాధతో పది కిలో మిటర్లు ఆఫీసుకు నడుచుకుంటూ వెళ్ళి, తిరిగి నడుచుకుంటూ రావడం పరబ్రహ్మాం పిసినారితనానికి పరాకాష్ఠ. కనీసం సాయంత్రం పూట ఎక్కడికైనా బయటకు వెళితే ఏదో ఓ రూపాన డబ్బు ఖర్చు అయిపోతుందన్న ఊహతో పూర్తిగా సాయంత్రం వేళ బయటకు వెళ్ళడమే మానేశాడు. మొదటి భార్య పరమపదించిన ఆరు నెలలకే కట్నం మీద ఆశతో రెండో పెళ్ళి చేసుకున్నాడు. మంచి ప్రభుత్వ ఉద్యోగం ఉంది కాబట్టి యాభై ఏళ్ళ వయసున్నా, పెళ్ళికెదిగిన ఇద్దరు పిల్లలున్నా తప్పని పరిస్థితుల్లో, లక్ష రూపాయల కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు లక్ష్మి అన్న, వదినలు.

పిల్లల పాలన విషయంలో కూడా తన పిసినారితనం ఏ మాత్రం వదలలేదు. మొదటి భార్య పిల్లలైన కుమార్‌ను డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదివించాడు. ఇప్పుడు కుమారే ఉద్యోగం చేస్తూ నెలకు రెండు వేలు సంపాదించి తండ్రికే సమర్పిస్తున్నాడు. కూతురు సౌమ్యను చదివించినా, చదివించకపోయినా కట్నం ఇవ్వక తప్పదని అతిగా ఆలోచించి కట్నం ఖర్చుతోపాటు మరల అదనంగా చదువుకు అయ్యే, అరకొర ఖర్చులు ఎందుకు దండగ అనుకొని, ప్రాథమిక విద్యలోనే చదువుకు స్వస్తి పలికించేశాడు. పరబ్రహ్మాం పిసినిగొట్టు చేష్టలు రోజురోజుకూ దినదిన ప్రవర్ధమానం కావటంతో పిల్లల పట్ల, తనపట్ల చూపే వికృత పిసినారి చేష్టలు తట్టుకోలేకే మొదటి భార్య గిరిజ నిద్ర మాత్రలు మింగి చనిపోయింది. ఇప్పుడు రెండవ భార్య లక్ష్మికి ఇద్దరు కొడుకులు. మొదటివాడు రవి మూడవ తరగతి, రెండవవాడు నరేంద్ర రెండవ తరగతి చదువుతున్నారు. ఇద్దరు ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుతున్నారు.

ఓ రోజు సాయంత్రం పరబ్రహ్మాం తమ్ముడు రామబ్రహ్మాం కూతురు పెళ్ళి ఖాయమైన సందర్భంలో, అన్నను పెళ్ళికి పిలవడానికి విజయవాడ నుండి కర్నూల్ వచ్చాడు. చాలా రోజుల తర్వాత తమ్ముడు వచ్చినా ఏ మాత్రం మర్యాద చేయలేదు పరబ్రహ్మాం. పెళ్ళి ఫలానా తేదీ అని, అందరూ పెళ్ళికి వారం రోజుల ముందే తప్పకుండా రావాలని చెప్పి, ఆ రోజు రాత్రికే ఊరు వెళ్ళిపోయాడు రామబ్రహ్మాం. వెళ్ళే ముందు ఓ షరతు పెట్టి మరీ వెళ్ళాడు. తన అన్నయ్య గురించి బాగా తెలుసు కాబట్టి, మీ కుటుంబంలో ఏ ఒక్కరైనా పెళ్ళికి రాని పక్షంలో ఇక జీవితంలో మళ్ళీ మీ ఇంటికి నేను గానీ, మా కుటుంబ సభ్యులుగానీ రారు అని మరీ మరీ హెచ్చరించి వెళ్ళాడు.

రామబ్రహ్మాం షరతు విన్నప్పటి నుండి పరబ్రహ్మాంకు గుండెపోటు వచ్చినంత పనయ్యింది. మొదట తమ్ముడు పెళ్ళి అనగానే తను ఒక్కడే వెళ్దాం అనుకున్నాడు. కానీ తమ్ముడి ఆంక్షతో ఇప్పుడు పెళ్ళికి అందరూ వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది. వారం రోజులపాటు ఆఫీసులో కూర్చుని ఏకధాటిగా ఆలోచించి, కుటుంబం అంతా కర్నూల్ నుండి విజయవాడ వెళ్ళడానికి అయ్యే ఖర్చు లెక్క కట్టాడు. ఒక్కొక్కరికీ ఊరు వెళ్ళి తిరిగి రావడానికి అయ్యే చార్జీ మూడు వందల రూపాయలు. ఆరు మందికి కలిపి పద్దెనిమిది వందలు, చదివింపులకు నూట యాభై రూపాయలు, అదనపు ఖర్చులకు ఓ యాభై రూపాయలు సరిపోతాయిలే అనుకొని మొత్తం రెండువేల రూపాయలతో, సరిగ్గా పెళ్ళి ఉదయం అనగా కుటుంబ సభ్యులతో కలిసి అర్ధరాత్రి పది గంటలకు బయల్దేరాడు. వెళ్ళేటప్పుడు ఇంటి తాళం సరిగ్గా వేశానా లేదా అన్న అనుమానంతో, ఓ అయిదారు

సార్లు తాళం లాగి, లాగి మరీ చూశాడు పర బ్రహ్మం.

ఇంటి నుండి బస్టాండుకు ఎనిమిది కిలో మీటర్లు. మధ్య మధ్యలో ఆటోవాళ్ళు అడుగు తున్నా, తక్కువ డబ్బులకే బతిమాలుతున్నా పర బ్రహ్మం ఏ ఆటోవాడికీ చలించలేదు. తను నడుచుకుంటూనే, కుటుంబ సభ్యులను నడిపించు కుంటూనే వీరోచితంగా వెళ్తున్నాడు. వెళ్ళే దారిలో పరబ్రహ్మంకు ఓ విపరీతమైన ఆలోచన వచ్చింది. రెండవ భార్య పిల్లలు ఎలాగూ చిన్నవాళ్ళు కాబట్టి వారిద్దరికీ హాఫ్ టికెట్స్ తీసుకుంటే సరిపోతుంది, అని మనసులో అనుకొని వెంటనే విషయం మెల్లగా లక్ష్మి చెవిలో చెప్పాడు పిల్లలెవరూ విన కుండా. అలా ఒప్పుకోరండీ హాఫ్ టికెట్ కేవలం నాలుగు సంవత్సరాల వయసు వరకే. మన పిల్లలకేమో ఒకడికి ఎనిమిది సంవత్సరాలు, ఇంకొకడికి ఏడు సంవత్సరాలు ఉన్నాయి అని చెప్పే లోపే వయసు తేడా ఉంది కేవలం మూడు, నాలుగు సంవత్సరాలే కదా! ఎలాగోలా సర్దుబాటు చేయవచ్చులే. ఇలా చేస్తే మనకు ఓ నూటయాభై రూపాయలు మిగుల్తాయి, ఇలా మిగిలిన డబ్బులు పెళ్ళిలోనైనా చదివించవచ్చు అని చెప్పి తన విపరీత ఆలోచనను సమర్థించుకున్నాడు. భర్త మాటలకు ఎదురు చెప్పలేక లక్ష్మి మౌనం దాల్చింది.

అర్ధరాత్రి పన్నెండు గంటలకు బస్టాండ్ చేరారు. అందరూ పరిగెత్తుకుంటూ వెళ్ళి బస్ ఎక్కారు. సీట్లు దొరకవేమోనన్న భయంతో. సీట్లు చాలా భాగం ఖాళీగానే ఉన్నాయి. బస్సుకు ముందు సీట్లల్లో పరబ్రహ్మం, లక్ష్మి కూర్చున్నారు. మధ్య సీట్లలో కుమార్, సౌమ్య కూర్చున్నారు. బస్సుకు వెనకాల సీట్లలో రవి, నరేంద్ర కూర్చు న్నారు. బస్ స్టార్ట్ అయ్యింది. కండక్టర్ టికెట్లు తీసుకోవడం మొదలెట్టాడు. పరబ్రహ్మంకు మన సులో భయంగా ఉన్నా, పైకి మాత్రం హుందాగా నటిస్తూ మొత్తం ఆరు టికెట్లు విజయవాడకు, అం దులో రెండు హాఫ్ టికెట్స్ అని సమాధానం చెప్పాడు. హాఫ్ టికెట్స్ ఎవరెవరికీ చూపించ మన్నాడు కండక్టర్.

పరబ్రహ్మం భయం భయంగానే వెనకాల సీట్లలో ఉన్న తన ఇద్దరు కుమారులను చూపిం చాడు. ఇద్దరినీ చూడగానే కాస్తంత అనుమానం వచ్చింది కండక్టరుకు. వారి వయసెంత అని అడి గాడు. ఒకడికి మూడు సంవత్సరాలు, ఒకడికి నాలుగు సంవత్సరాలు అని ఏమాత్రం తడుము కోకుండా గంభీరంగా సమాధానం చెప్పాడు. ఇంత గంభీరంగా సమాధానం చెప్పడంతో, కండక్టర్ ఇంకేమీ మాట్లాడకుండా ఓ చూపు చూసి, మిగిలిన అన్ని టికెట్లు తీసుకొని తన సీట్లో వెళ్ళి కూర్చున్నాడు. విజయగర్వంతో పరబ్రహ్మం ముఖం ఆనందంతో వెలిగిపోయింది. ఎవరి టికెట్లు వారికి ఇచ్చేశాడు ముందు జాగ్రత్తతో. బస్సు వేగంగా పోతోంది. కండక్టర్ లైటాఫ్ చేశాడు. అందరూ ప్రశాంతంగా పడుకున్నారు. పరబ్రహ్మంకు మాత్రం అమితానందంతో నిద్ర పట్టనే లేదు. చీక



తమిళనాడు తెలుగు సాంస్కృతిక సంఘం పెరంబూరులోని డి.ఆర్.బి.కె.కె. శ్రేష్ఠి ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 9వ తేదీ సాయంత్రం ఉగాది ఉత్సవం నిర్వహించిన సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న తమ్మినేని బాబు, వెంకట్రమణ, వంకాయల సత్యనారాయణ, పి. సుబ్బారెడ్డి, సి.ఎమ్.కె. రెడ్డి, శేతురామన్ గార్లను చూడవచ్చు

టిగా ఉన్నా ఏవో లెక్కలు వేసుకుంటున్నాడు. తీరా బస్సు ఊరు చేరుతుందనగా సడన్‌గా బస్సు ఆగింది. అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. కండక్టర్ బస్సు దిగి చూశాడు ఏదన్నా ప్రాబ్లమ్ ఉందేమోనని. ఎదురుగా చెకింగ్ అధికారుల జీప్ ఆగింది. వారిని బస్సులోకి ఆహ్వానించాడు కండక్టర్.

ముందుగా బస్సు వెనకాల వైపు నుండి చెకింగ్ మొదలెట్టారు. వెనకాల సీట్లో పడుకున్న నరేంద్ర, రవిలను నిద్రలేపి టిక్కెట్లను చూపించ మన్నాడు ఓ అధికారి. పరబ్రహ్మం ముందు వైపు నుండి ఏవో సైగలు చేస్తున్నాడు. ఇద్దరూ కళ్ళు తుడుచుకుంటూనే తమ జేబులో ఉన్న టికెట్లను చూపించారు. అధికారికి అనుమానం వచ్చి మీరేం చదువుతున్నారు అని అడిగాడు. వీరికి విషయ మేమీ తెలియదు కాబట్టి, తడుముకోకుండా మూడవ తరగతి, రెండవ తరగతి అని సమాధానం చెప్పారు. అంతే ఒక్కసారిగా బండారం కాస్త బద్దల య్యింది. అధికారి కండక్టరును తీవ్రంగా చూశాడు. కండక్టర్ అత్యంత తీవ్రంగా పర బ్రహ్మంను అధికారులకు చూపించాడు. బస్సులో చాలాసేపు తిట్ల వర్షం కురిసింది. పరబ్రహ్మం మారు మాట్లాడకుండా సిగ్గుతో తల వంచు కున్నాడు.

బస్సులో ఉన్నవాళ్ళంతా తిట్టారు. ఇంత పెద్ద మనిషివి అయ్యుండి నీకు ఇదేం పాడు బుద్ధి అని, డబ్బు కోసం ఇంత కక్కుర్తికి పాల్పడతావా అని. రెండు అబద్ధ హాఫ్ టికెట్లకు ఐదు వందల రూపాయల జరిమానా కట్టండి, డబ్బు లేదంటే కుటుంబం అంతా జైలుకు పదండి అని ఆదేశించాడు అధికారి పరబ్రహ్మంను. పరబ్రహ్మం మాత్రం అవమాన భారంతో దించిన తల ఎత్తనే ఎత్తలేదు.

కుమార్ తన పర్సులోంచి ఐదు వందల రూపాయలు తీసి జరిమానా కట్టాడు. ఇన్ని రోజులు పిల్లల పట్ల చూపిన విపరీత ప్రవర్తనకు మనసులో చాలా బాధపడ్డాడు పరబ్రహ్మం. తను చేసిన పిసినారి పనుల పట్ల తనకే అసహ్యం వేసింది. కుటుంబ సభ్యులందరికీ క్షమాపణ చెప్పాడు. అందరూ పెళ్ళికి చేరుకున్నారు. పెళ్ళి ముగిసి ఊరు తిరిగి వచ్చాక, పరబ్రహ్మం తన విపరీత పిసినారి తనానికి స్వస్తి పలికి, హుందాగా గడపడం ప్రారంభించాడు. సౌమ్య పెళ్ళి, కుమార్ పెళ్ళి ఒకేసారి ఘనంగా, వైభవంగా జరిపించాడు. పెళ్ళికి వచ్చిన బంధువులంతా, పరబ్రహ్మంలో వచ్చిన మార్పు చూసి, ముందు విస్తుపోయి తర్వాత ఆనందించారు. ←

